సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం। 20। నవంబర్। 2024

ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: నగరంలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.





సృజన వెలికితీసేందుకే బాలోత్సవ్

విశాఖ నగరంలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బాలోత్సవ్ వేడుకగా ప్రారంభమైంది.

8లో



అప్పన్నకు గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడ సేవ జరిగింది. విశేషంగా హారతి అందించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏకలవ్య పాఠశాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

అరకులోయ టౌన్: ఏకలవ్య పాఠశాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు అరకులోయ క్రీడా పాఠశాలలో బుధవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని గురుకులం పాఠశాలల కోఆర్డినేటర్ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగో రాష్ట్ర స్థాయి ఏకలవ్య పాఠశాలల క్రీడా పోటీలు మూడు రోజులు జరుగుతాయన్నారు. వీటిలో 22 వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తామని, రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొంటున్నట్టు ఆయన వివరించారు.

మోదమ్మ భక్తులకు ఉచిత భోజనాలు



భోజనాలను పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయంలో మంగళవారం భక్తులకు నిత్యాన్నదానంలో భాగంగా ఉచిత భోజనాలను ఆలయ కమిటీ చైర్మన్,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఘనంగా ప్రారంభించారు. భక్తులకు ఆయన స్వయంగా భోజనాలు పంపిణీ చేశారు. టూరిజం అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్‌నాయుడు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సోమరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ చింతపల్లి డీఈగా కరుణ

- బాధ్యతలు స్వీకరణ



చింతపల్లి: ఆర్‌డబ్ల్యూఎస్ చింతపల్లి డీఈగా జి. కరుణ నియమితులయ్యారు.ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డీఈ టీఆర్‌హెచ్ రాజు అనంతగిరి బదిలీ అయ్యింది. ఏఈఈగా పనిచేస్తున్న కరుణను పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

లోకమాన్యతిలక్ టెర్మినస్-భువనేశ్వర్ వన్‌వే స్పెషల్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం లోకమాన్య తిలక్ టెర్మినస్-భువనేశ్వర్ మధ్య విశాఖపట్నం మీదుగా వన్ వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. లోకమాన్యతిలక్ టెర్మినస్-భువనేశ్వర్(01097) వన్ వే స్పెషల్ మంగళవారం అర్ధరాత్రి తర్వాత((బుధవారం) 12.45 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరుతుంది. గురువారం తెల్లవారు 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుని, అదే రోజు ఉదయం 10.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది.

ప్రత్యేకాధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కేజీబీవీ బాధిత విద్యార్థినుల డిమాండ్



జి.మాడుగులలో కేజీబీవీ బయటకు వచ్చి ధర్నా చేస్తున్న బాధిత విద్యార్థినులు

జి.మాడుగుల: కస్తూర్బా విద్యాలయంలో జుత్తు కత్తిరించిన ఘటనపై ప్రత్యేకాధికారి సాయి ప్రసన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థినులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు కేజీబీవీ బయటకు వచ్చి ధర్నా చేశారు. ఈ ఘటనపై విచారణ నిర్వహించిన విద్యాశాఖ అధికారులు విధుల నుంచి ఆమెను విధుల తొలగిస్తామని హామీ ఇచ్చారని వారు వివరించారు. ఆమెకు సహకరించడమే కాకుండా తమను కొట్టిన కెమిస్ట్రీ పీజీటీపై తూతూమంత్రంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసిందన్నారు. సస్పెన్షన్ చేయడం వల్ల మరో కేజీబీవీలో ప్రత్యేకాధికారిగా నియమించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమపై అమానుషంగా వ్యవహరించిన ప్రత్యేకాధికారి సాయి ప్రసన్నపై శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మన్యం గజగజ



ప్రముఖ పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో దట్టంగా కురుస్తున్న మంచు

- రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అరకులో 8.5, పాడేరులో 10.8..
- చింతపల్లిలో 11.3 డిగ్రీల నమోదు.. రెండు రోజుల్లో 7 డిగ్రీల తగ్గుదల
- మరింత చలి పెరిగే అవకాశం: చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి



చలికి తాళలేక మంటను కాగుతున్న గిరిజనులు

సాక్షి, పాడేరు/చింతపల్లి: మన్యంలో గిరిజన గ్రామాలు గజగజలాడుతున్నాయి. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.

- పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని రానున్న రోజుల్లో మరింత తగ్గుముఖం పట్టి చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.
- పాడేరు డివిజన్ పరిధిలో మంగళవారం గూడెంకొత్తవీధిలో 11.1 డిగ్రీలు, దుంబ్రిగుడలో 8.2 డిగ్రీలు, అరకులోయలో 8.5, జి మాడుగులలో 80.4, పాడేరులో 10.8 ముంచంగిపుట్టులో10.9, హుకుంపేట 11.4, పెదబయలులో 11.9, అనంతగిరిలో 13.7, కొయ్యూరులో 15 డిగ్రీలు, చింతపల్లిలో 11.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని ఏడీఆర్ తెలిపారు.
- ఈ నెలలో మొదటిగా 11వ తేదీన14.3 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మరుసటి రోజు 12 నుంచి 17వ తేదీ వరకు ఆరు రోజులపాటు 18 డిగ్రీలు నమోదు అయ్యింది. ఆదివారం ఒక్కసారిగా 3.6 డిగ్రీలు తగ్గి 14.4 డిగ్రీలు నమోదు కాగా, సోమవారం మరో మూడు డిగ్రీలు తగ్గి 11.3 నమోదు అయ్యింది.
- కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న కారణంగా చలిగాలులు వీస్తున్నాయి. సాయంత్రం వేళల్లో వీటి ప్రభావం ఎక్కువగా ఉంది. చింతపల్లి ప్రాంతంలో ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తోంది.



చాపరాయి జలవిహారిని కమ్మేసిన మంచు తెరలు

దుంబ్రిగుడ: మండలంలో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు వణికించాయి. దీంతో గిరిజనులు, పర్యాటకులు, వ్యాపారులు అవస్థలు పడ్డారు. చాపరాయి జలవిహారి ప్రాంతంలో మంచు తెరలు కమ్మేశాయి.

పెరిగిన చలి తీవ్రత

సీలేరు: సీలేరులో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. మంగళవారం 11.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఐస్‌గెడ్డ జలపాతం, గుంటవాడ జలాశయం, ఇనటెక్ డ్యాం వద్ద మంచు దట్టంగా కురిసింది.

టెలికాం వినియోగదారులకు నాణ్యమైన సేవలు



మండిపుట్టులో సెల్ టవర్ యంత్రాల వ్యవస్థను పరిశీలిస్తున్న గుల్జార్ నటరాజన్



మోదాపల్లిలో కాఫీ తోటలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న గుల్జార్ నటరాజన్



మాట్లాడుతున్న కేంద్ర టెలీ కమ్యూనికేషన్ల శాఖ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్

- త్వరితగతిన బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ల నిర్మాణం పూర్తి చేయాలి
- కేంద్ర టెలీ కమ్యూనికేషన్ల శాఖ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్ ఆదేశం

సాక్షి, పాడేరు: జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన టెలికాం సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని కేంద్ర టెలీ కమ్యూనికేషన్ల శాఖ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వంజంగి గ్రామ సచివాలయం, ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలతో ఆస్పత్రిలో ప్రసవాలపై మాట్లాడారు. విద్యార్థుల ప్రాథమిక విద్యపై సమీక్షించారు. ఆంగ్ల పాఠ్యాంశాలను విద్యార్థులు చదవడంతో అభినందించారు. డోకులూరు పంచాయతీ మండిపుట్టులో రూ.87 లక్షలతో నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని పరిశీలించారు. మొబైల్ టవర్, సోలార్ పవర్, సిగ్నల్ విధానాలను పరిశీలించారు. గిరిజనులతో ఆయన మాట్లాడారు. సెల్‌టవర్ ప్రయోజనాలను వారి నుంచి తెలుసుకున్నారు. ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు వాయిస్ సక్రమంగా వినిపించడం లేదని వారు చెప్పారు. ఇందుకు కారణమైన సాంకేతిక సమస్యలను వారం రోజుల్లో పూర్తి చేసి గిరిజనులకు నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. మండిపుట్టులో సెల్‌టవర్ ఏర్పాటుతో డోకులూరు, బరిసింగి పంచాయతీలకు సెల్‌సేవలు అందుబాటులో వచ్చాయని సర్పంచ్ కె.సన్నిబాబు తెలిపారు. మోదాపల్లిలో గిరిజనులు సాగు చేస్తున్న కాఫీతోటలను పరిశీలించారు. కాఫీ, అంతర పంటగా మిరియంపై వచ్చే ఆదాయ వివరాలను రైతుల నుంచి తెలుసుకున్నారు.

సెల్ టవర్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

జిల్లా వ్యాప్తంగా మంజూరైన సెల్‌టవర్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కేంద్ర టెలి కమ్యూనికేషన్ల శాఖ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన సెల్‌టవర్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణంలో జాప్యం జరగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన బీఎస్ఎన్ఎల్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలో 565 టవర్లను మంజూరు చేస్తే 157 పూర్తి చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జియోకు సంబంధించి 465 టవర్లకు 413 పూర్తి చేసిందని, బీఎస్ఎన్ఎల్ టవర్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆప్టికల్ ఫైబర్ పనులు 394కు 228 పూర్తి చేశారని, సెల్‌టవర్ల పనుల పురోగతిపై సమీక్షించాలని ఐటీడీఏ పీవో అభిషేక్‌ను ఆదేశించారు. ఆకాంక్ష జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి పథకాల నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, డీఆర్వో పద్మలత, డీఈవో పి.బ్రహ్మజీరావు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న టీడీపీ నేతపై చర్యలు తీసుకోండి

ఎస్‌ఐను కోరిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

జి.మాడుగుల: ఎంపీటీసీలు, సర్పంచ్‌ల పేర్లు చెప్పి దందా సాగిస్తూ, తమను అగౌరవ పరుస్తున్న టీడీపీ నాయకుడు లకే రామకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మండలంలో జీఎం కొత్తూరు వద్ద గల కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులను దండించి, వారి జుత్తు కత్తిరించిన ఘటనతో పాటు ఇతర విషయాలు బయటకు రాకుండా ఎంపీటీసీ, సర్పంచ్‌లను మేనేజ్ చేస్తానని వంజంగిపాడుకు చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణ కేజీబీవీ ప్రత్యేకాధికారి సాయి ప్రసన్నను రూ.లక్ష ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేశాడని వారు ఆరోపించారు. తమ పేర్లు వాడినందుకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ షణ్ముఖరావును వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, అప్పారావు, చిట్టిబాబు,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, కృష్ణమూర్తి, సూరిబాబు, గంగరాజు, కొండబాబు, పెదబాలన్న, మత్స్యం నాయుడు, సింహాచలం పాల్గొన్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

వాహన తనిఖీల్లో పట్టివేత





గంజాయి నిందితులతో మోతుగూడెం, డొంకరాయి పోలీసులు



గంజాయి నిందితులతో హుకుంపేట పోలీసులు

మోతుగూడెం: మోతుగూడెం, డొంకరాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం రెండు కేసుల్లో 40 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి తరలిస్తూ తనిఖీలు నిర్వహిస్తున్న డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్‌కు పట్టుబడ్డారు. వారిద్దరి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గంజాయి రవాణాకు సంబంధించి ముందస్తు సమాచారం మేరకు మోతుగూడెం ఎస్‌ఐ శివన్నారాయణ అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా పోలీసుస్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. రెండు బైక్‌లపై సీలేరు నుంచి కరీంనగర్ తరలిస్తున్న 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు మోటార్ బైక్‌లు, నాలుగు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

హుకుంపేటలో 135 కిలోలు..

హుకుంపేట: గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిలో నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మంగళవారం దిగుడుపుట్టు జంక్షన్‌లో ఒడిశాలోని తెంతులుగుడాకు చెందిన ముగ్గురు వ్యక్తులు వస్తున్న కారును తనిఖీ చేయగా మూడు బస్తాల్లో 135 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. కారులో ఉన్న వారితోపాటు పైలెట్‌గా బైక్ వస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. కారులో ఉన్న ముగ్గురిలో ఒకరు పరారైనట్టు ఎస్‌ఐ తెలిపారు. కారు, బైక్ సీజ్ చేసి, నిందితులు నలుగురిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యమే కీలకం





సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మపర్వీన్, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



సదస్సుకు హాజరైన యువత

సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మపర్వీన్

రంపచోడవరం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యం సరిగ్గా చెప్పకపోవడం వల్లే శిక్షలు పడటం లేదని సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మపర్వీన్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రావులపాలెం, అమలాపురం, కొవ్వూరు, నిడదవోలు, తణుకు, చింతూరులో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాక్షులు కోర్టుకు వచ్చి సాక్ష్యం సరిగా చెప్పాలని తెలిపారు. ఎస్టీలకు చట్టరీత్యా వారికి లభించే రక్షణ, హక్కుల గురించి వివరించారు. అనంతరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మానవ హక్కులు, సమానత్వంపై వివరించారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ యువత అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలన్నారు.సమాజంలో అంతరానితనం నిర్మూలనపై, ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్‌పై డీడీ విజయశాంతి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ నాగరాజు, రంపచడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్, తహసీల్దార్ రామకృష్ణ, సీఐలు పాల్గొన్నారు.

రేపు భీమిలిలో జాబ్‌మేళా

భీమునిపట్నం (విశాఖ): భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, కల్యాణి జ్యువెలర్స్, మాస్ మెరైన్ సర్వీస్ ఇండియా, ఎస్.కె.ఎల్ మొదలైన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, 10వ తరగతి పూర్తి చేసిన నిరుద్యోగ యువతీయువకులు ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన వారు విశాఖపట్నం, గాజువాక, తగరపువలస, భోగాపురం, గోపాలపట్నం, విజయనగరం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 90147 58949ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

వచ్చే నెల 2 నుంచి శ్రీ నృసింహ దీక్షలు



సింహాచలం (విశాఖ): శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షలు డిసెంబర్ 2 నుంచి ప్రారంభమవుతాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు మంగళవారం తెలిపారు. దేవస్థానం వైదికులు నిర్ణయించిన ప్రకారం 2 నుంచి మండల దీక్ష, 12 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. ఆయా రోజుల్లో దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం తరఫున మాల ధారణ చేసి, తులసి మాల, స్వామివారి ప్రతిమ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షలు విరమించాల్సి ఉంటుందన్నారు. దీక్ష చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు


రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరిక



గెద్దాడ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: గ్రామ సచివాలయాల సిబ్బంది గ్రామాల సందర్శనకు వెళుతున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చి విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఆయన పెదగెద్దాడ సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు తిరిగి ఎన్ని గంటలకు కార్యాలయానికి వచ్చింది రిజిస్టర్‌లో టైమ్‌తో సహా నమోదు చేయాలన్నారు. అనంతరం గెద్దాడలో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

పోటెత్తిన పర్యాటకులు



వంజంగి కొండలపై ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: పర్యాటక సీజన్ కావడంతో పాడేరు ప్రాంతంలోని వంజంగి హిల్స్‌కు మంగళవారం పర్యాటకుల తాకిడి నెలకొంది. చలుగాలులు వీస్తున్నా భారీగా తరలివస్తున్నారు. పొగమంచు, సూర్యోదయం, మేఘమాలికల అందాలను తిలకించారు. వీకెండ్‌తో సంబంధం లేకుండా రావడంతో ఉదయం పది గంటల వరకు సందడి నెలకొంది.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అల్లూరి సీతారామరాజు జిల్లా డౌనూరు చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నర్సీపట్నం: పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లను ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం తనిఖీ చేశారు. రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, ప్రస్తుతం వారు జీవనోపాధికి ఏమేమి పనులు చేస్తున్నారో ఆరా తీశారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక, డైనమిక్ తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ మోహన్ ఉన్నారు.

డౌనూరు చెక్‌పోస్టు తనిఖీ

అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దులో డౌనూరు వద్ద ఉన్న ఎన్‌డీపీఎస్ చెక్‌పోస్టును ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లో నమోదైన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది వాహన తనిఖీలను పర్యవేక్షించి సూచనలు చేశారు.

క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగి ఆచూకీ లభ్యం

దేవీపట్నం: ఇటీవల అదృశ్యమైన పూడిపల్లి సచివాలయ ఉద్యోగి శ్రీ సౌమ్య ఆచూకీ లభ్యమైనట్టు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు చెప్పారు. ఒడిశాలో ఆమె ఆచూకీ కనుగొని, అక్కడి నుంచి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నాయీ బ్రాహ్మణ సంఘం ఆర్థిక సాయం


బాధితునికి నగదు అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

కూనవరం: అనారోగ్యానికి గురై చింతూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని నర్సింగపేట గ్రామానికి చెందిన అయిన పర్తి వీరభద్రానికి నాయీ బ్రాహ్మణ సంఘం ఆర్థిక సాయం అందజేసింది. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అందజేసిన రూ.8 వేల నగదును ఆ సంఘం విలీన మండలాల కన్వీనర్ ఎంవీవీ రాజు మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈకార్యక్రమంలో కె.వెంకట్రావ్, జి.కొండబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు


డ్రాయింగ్ పోటీల్లో విజేతలతో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి


మెడికల్ కళాశాల విద్యార్థులు గీసిన చిత్రాలు

సాక్షి,పాడేరు: ప్రపంచ మధుమేహ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మధుమేహం వ్యాధికి గల కారణాలు, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై విద్యార్థులు చిత్రాలు గీసారు.వాటిని పరిశీలించిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి,ఇతర వైద్యులు... విజేతలను ఎంపిక చేశారు.ఈ పోటీల్లో మొదటి బహుమతి భావన,రెండవ బహుమతి ప్రభుకుమార్,మూడవ బహుమతి అంజుమన్‌బాబి,ప్రత్యేక బహుమతి లావణ్య పొందారు. వారందరికీ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, డాక్టర్ రమ్య, డాక్టర్ ధనలత అందజేశారు.

ఆన్‌లైన్ చదువు.. భవితకు వెలుగు

- ఏయూలో డిస్టెన్స్ కోర్సులకు ఆదరణ
- రాష్ట్రంలో ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టిన తొలి వర్సిటీ
- ఇంట్లో నుంచే పరీక్షలు రాసే అవకాశం
- విదేశీ విద్యార్థులు సైతం చేరిక


ఏయూలోని దూర విద్యాకేంద్ర కార్యాలయం


పర్యవేక్షణ చేస్తున్న సాంకేతిక విభాగం

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో చదువుల ట్రెండ్ మారుతోంది. స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం ద్వారా మూడేళ్ల కిందట అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ కోర్సులకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో నిలుదొక్కుకొన్న యువత ఆన్‌లైన్ కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు ఉద్యోగాలు చేస్తూనే ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసి.. తమ భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేసుకుంటున్నారు. డిస్టెన్స్, ఆన్‌లైన్ కోర్సులకు విద్యార్థుల నుంచి లభిస్తున్న ఆదరణతో 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై వర్సిటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. షెడ్యూల్ మేరకు ఈ నెల 15తో తొలి విడత అడ్మిషన్ల గడువు ముగిసినందున తరగతుల నిర్వహణపై స్టడీ సెంటర్ల నిర్వాహకులను అధికారులు అప్రమత్తం చేశారు. డిసెంబర్‌లో మరో విడత ప్రవేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

రాష్ట్రంలో తొలి వర్సిటీ ఇదే..

వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే స్కూల్ ఆఫ్‌డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 115 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా డిగ్రీ, పీజీ, డిప్లమో వంటి 33 రకాల కోర్సుల్లో ఏటా 20 వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఏయూ అధికారులు మరో అడుగు ముందుకేశారు. 2021–22 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానంలో కూడా డిగ్రీ, పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆన్‌లైన్ కోర్సులకు క్రేజ్

వర్సిటీలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కోర్సులకు ఏడాదికేడాది చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. తొలి ఏడాది రెండు కోర్సులను మాత్రమే నిర్వహించగా, 41 మంది విద్యార్థులు చేరారు. క్యాలెండర్ ఇయర్, అకడమిక్ ఇయర్ పేరుతో ఏటా రెండు సార్లు ప్రవేశాల కోసమని నోటిఫికేషన్ ఇస్తున్నారు. 2022– 23లో 12 కోర్సులకు 365 మంది, 2023–24లో 9,932 మంది చేరగా, వీరిలో ఎంబీఏ కోర్సు వారే 4,135 మంది ఉండటం గమనార్హం. కాగా వర్సిటీపై ఉన్న క్రేజ్‌తో విదేశాల నుంచి కూడా విద్యార్థులు ఆన్‌లైన్ కోర్సుల్లో చేరుతున్నారు. ఇలా ఇప్పటి వరకు వంద మంది విదేశీయులు కోర్సుల్లో చేరినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ మొత్తం పరిణామాలతో ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య బాగా పెరుగుతోందని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు.

చదువు.. ఉపాధి

ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉపాధి కల్పించేలా వర్సిటీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. కోర్సుల నిర్వహణ బాధ్యతలు చూసే సాంకేతిక విభాగం ఇందుకోసమని ఏపీ, తెలంగాణ, కర్నాటక తదితర రాష్ట్రాల్లోని కొన్ని కార్పొరేట్ సంస్థలతో ముందస్తు ఒప్పందం చేసుకుంది. ఆన్‌లైన్ కోర్సు ఫీజుకు అదనంగా అప్రెంటీస్‌షిప్ పేరుతో రూ.3వేలు చెల్లించిన వారికి ఉద్యోగ అవకాశాలను చూపిస్తున్నారు. ఇలా ఈ మూడేళ్ల కాలంలో 45 మందికి ఉపాధి కల్పించారు.

ఇంట్లో నుంచే పరీక్షలు రాసే అవకాశం

ఆన్‌లైన్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు వార్షిక పరీక్షలను ఇంట్లో నుంచే రాయవచ్చు. షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాలు వినాలి. వార్షిక పరీక్షల్లో థియరీకి 70, ఇంటర్నల్స్‌కు 30మార్కులు ఉంటాయి. ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాల బోధనకు ఫ్యాకల్టీని నియమించారు. వార్షిక పరీక్షలను సీసీ కెమెరాలో రికార్డు అయ్యే విధంగా విద్యార్థి ఇంట్లో, లేదా కంప్యూటర్ అందుబాటులో ఉన్న ఎక్కడ నుంచైనా పరీక్ష రాయవచ్చు. అడ్మిషన్ తీసుకునే మొదలు కోర్సు పూర్తయ్యేంత వరకు విద్యార్థి ఆన్‌లైన్ చదువుల తీరును సమగ్ర పరిశీలన చేసేందుకు వర్సిటీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.

బోధనపై ప్రత్యేక దృష్టి



ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహించే కోర్సుల్లో ప్రవేశాలు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. స్టడీ సెంటర్లపై కూడా పర్యవేక్షణ పెంచేలా కార్యాచరణ సిద్ధం చేశాం. రెగ్యులర్ కోర్సులతో సమానమైన గుర్తింపు ఉన్నందున.. పాఠ్యాంశాల బోధన కూడా సవ్యంగా సాగేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఆచార్య ఎస్.విజయ్ మోహన్, ఏయు దూరవిద్య డైరెక్టర్

విచారణాధికారులకు విజిలెన్స్ లేఖ


ఈవో రామచంద్రమోహన్‌ను కాపాడేందుకేనా?

- సింహాచలం భూముల అక్రమాలకు గతంలోనే విచారణ
- తాజాగా సందేహాల నివృత్తి పేరిట విచారణాధికారులకు పిలుపు

మహారాణిపేట: సింహాచలం భూములను నిషేధిత జాబితా నుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించారన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్న దేవదాయశాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను కాపాడేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై గతంలోనే విచారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అధికారులు.. ఇప్పుడు తమ ముందు హాజరుకావాలని విజిలెన్స్ లేఖ రాయడం అనేక ఊహాగానాలకు దారితీసింది. ఇప్పటికే అధికారులు అందించిన నివేదిక ప్రభుత్వం వద్దే ఉన్నప్పటికీ.. మళ్లీ దానిపై ప్రత్యేకంగా వివరాలు తెలుసుకోవాలనుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం అన్నవరం కార్యనిర్వహణాధికారి(ఈవో)గా దేవదాయ శాఖ అడిషినల్ కమిషనర్ రామచంద్రమోహన్ విధులు నిర్వర్తిస్తున్నారు. 2007–2008లో విశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా ఉంటూ సింహాచలం ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరించారు. మళ్లీ 2013 మార్చి నుంచి 2019 ఆగస్టు వరకు ఆరేళ్ల పాటు సింహాచలం ఈవోగా విధులు నిర్వర్తించారు.

భూముల అన్యాక్రాంతంపై ఆరోపణలు

2016 డిసెంబర్ నుంచి 2017 ఫిబ్రవరి మధ్య సింహాచలం దేవస్థానానికి చెందిన 862 ఎకరాల భూములను రిజిస్టర్ నుంచి తొలగించారని రామచంద్రమోహన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే మాన్సాస్ భూముల విషయంలో కూడా అక్రమాలు జరిగినట్లు వార్తలు వినిపించాయి. దీనిపై గత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందుకోసం అసిస్టెంట్ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్, జాయింట్ కమిషనర్ డి.భ్రమరాంబ, డిప్యూటీ కమిషనర్(వీఆర్) ఈ.వి.పుష్పవర్ధన్‌లతో కమిటీని నియమించింది. ఈ ఆరోపణలపై కమిటీ విచారించి 2021 జూలై 16న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రామచంద్రమోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేల్చింది. దీంతో ప్రభుత్వం అతనిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు పూర్తిస్థాయి వాస్తవాల కోసం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత రామచంద్రమోహన్ కోర్టుకు వెళ్లి తిరిగి పోస్టింగ్ తెచ్చుకున్నారు.


విచారణాధికారులను పిలిచిన విజిలెన్స్

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలల తర్వాత విజిలెన్స్ అధికారులు ఇప్పుడు రాసిన ‘లేఖ’అనేక సందేహాలకు తావిస్తోంది. ఆరోపణలపై సందేహాల నివృత్తి పేరుతో గతంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విచారణాధికారులను ప్రశ్నించాలని నిర్ణయించారు. ఇందు కోసం ఈ నెల 22లోగా అసిస్టెంట్ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్, జాయింట్ కమిషనర్ డి.భ్రమరాంబ, డిప్యూటీ కమిషనర్(వీఆర్) ఈ.వి.పుష్పవర్ధన్‌లు తమ ముందు హాజరుకావాలని దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ నిర్ణయించడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింహాచలం భూముల అక్రమాలను పక్కనపెట్టి.. అప్పటి ప్రభుత్వ పెద్దలు ఏమైనా ఒత్తిళ్లు చేశారా? రామచంద్రమోహన్‌కు వ్యతిరేకంగా నివేదిక రావడానికి కారణాలేంటి? తదితర విషయాలపై ఆరా తీసే అవకాశాలు ఉన్నట్లు ఆ శాఖలోనే చర్చ జరుగుతోంది.

మరుగుదొడ్లు లేని ఇళ్లే అధికం

వరల్డ్ టాయ్‌లెట్ డే సందర్భంగా వెలుగు చూసిన వాస్తవం


నిర్మాణం పూర్తికాని ఓ టాయ్‌లెట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరావు

రాజవొమ్మంగి: వరల్డ్ టాయ్‌లెట్ డే సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరిస్తున్న సమయంలో మరుగుదొడ్లు లేని ఇళ్లే అధికంగా ఉన్నాయని తేలింది. మా ఇళ్లకు మరుగుదొడ్లు లేవని పలువురు పేద గృహిణులు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. టాయ్‌లెట్లు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానిక ఎస్సీ కాలనీలో మహిళలు వాపోయారు. కొందరు బిల్లులను స్వాహా చేయడంతో ఎన్ఆర్‌జీఎస్, స్వచ్ఛ భారత్ పథకంలో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయన్నారు. కొత్తగా మరుగుదొడ్డి కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం లేకుండా పోయిందని మహిళలు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో..

ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ లేదని, రన్నింగ్ వాటర్ సదుపాయం కూడా లేదని అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో టాయ్‌లెట్లను బాగుచేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో నూతనంగా మరుగుదొడ్లు మంజూరుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్‌బాబు

కూనవరం: పిల్లల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్‌బాబు తెలిపారు. కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జాతీయ నవజాత శిశు సంరక్షణ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల నుంచి తల్లులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా మహేశ్‌బాబు మాట్లాడుతూ తల్లులు తమ ఆరోగ్యంతో పాటు బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్లో అనారోగ్య సమస్యలు వస్తే దగ్గరలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి వైద్యుల పర్యవేక్షణలో మందులు వేయాలన్నారు. అనంతరం డాక్టర్ శ్వేత మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని తెలిపారు. ఎస్ఎన్‌సీయూ పిల్లల వైద్యురాలు ప్రజ్వల మాట్లాడుతూ తల్లులు పరిశుభ్రత పాటిస్తే పిల్లలను అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తేజ, వివేక్ నాయక్, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది కె.ఇందు, దుర్గమ్మ, శ్రీవల్లీ, మౌనిక, సత్యపావనీ,ఫార్మసిస్ట్ జోగారావు, కౌన్సిలర్ కె.రమేష్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి


గంగవరంలో ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ భూషణం, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు


కినపర్తిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వినోద్

గంగవరం: యువత, విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.స్థానిక ఎస్‌ఐ డి.భూషణం ఆధ్వర్యంలో పలు అంశాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. అనంతరం ఎస్‌ఐ భూషణం మాట్లాడుతూ మద్యం మత్తులో చాలా మంది వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టి.మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ నరసింగరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, విజయలక్ష్మి, నీతిఅయోగ్ ప్రతినిధి హేమ, ఆశ్రమ పాఠశాల పీడీ నాగమణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: చెడు వ్యసనాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అడ్డతీగల ఎస్‌ఐ వినోద్ తెలిపారు. మండలంలోని కినపర్తిలో ప్రజలకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


చింతపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


పాడేరు గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు


మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సత్యవతి,ఉపాధ్యాయులు


గంగవరంలో ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి గంగాభవాని, రాజ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయి. పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు.జిల్లా కేంద్రమైన పాడేరు గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వ్యాస రచన,మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవ, కన్నయ్య, భీమునాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని రాజ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్లేరు కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొంపా కొండబాబు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీకి నివాళులర్పించారు.

గంజాయి రహితంగా జి.మాడుగుల మండలం


మాట్లాడుతున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: మండలాన్ని గంజాయి రహితంగా మార్చడానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని స్థానిక ఎస్‌ఐ షణ్ముఖరావు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎంపీటీసీ, సర్పంచ్‌లు, మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయిని పండించి జీవితాలు పాడుచేసుకోవద్దని సూచిస్తూ ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు సర్పంచ్, ఎంపీటీసీలు, మహిళా పోలీసులు సమన్వయంతో పని చేయాలన్నారు.

నేషనల్ వుషు టోర్నమెంట్‌కు నర్సీపట్నం విద్యార్థులు



వుషు క్రీడాకారులు గండి జ్యోతి, ముత్యాల పూజిత

నర్సీపట్నం : జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 22 నుండి 26 వరకు జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్ వుషు టోర్నమెంట్‌లో నర్సీపట్నం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ పదో తరగతి విద్యార్థి గండి జ్యోతి, డాక్టర్. బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థిని ముత్యాల పూజిత పాల్గొంటున్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ పోటీలకు తీసుకువెళ్తున్నట్టు కోచ్ శేఖర్ తెలిపారు.

సృజన వెలికితీసేందుకే బాలోత్సవ్

విశాఖ బాలోత్సవంలో వక్తలు


మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం


పోటీలో పాల్గొన్న వివిధ పాఠశాలల చిన్నారులు

దాబాగార్డెన్స్(విశాఖ): మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విశాఖ బాలోత్సవం వేడుకగా ప్రారంభమైంది. విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు పిల్లల మర్రి రఘు అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశాఖ బాలోత్సవం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పిల్లలను ప్రోత్సహించేందుకు ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలని స్కూల్ యాజమాన్యాలు, తల్లిదండ్రులకు సూచించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పిల్లలు దేనినైనా సూక్ష్మంగా గ్రహిస్తారన్నారు. కన్సర్న్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పీకే జోష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు చాలా అవసమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రత్నకుమార్ మాట్లాడుతూ విశాఖలోని బాలలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఇన్ని ఈవెంట్స్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.రమాప్రభ మాట్లాడుతూ రెండు నెలలుగా ఈ కార్యక్రమం కోసం కృషి చేయగా 120 పాఠశాలల నుంచి దాదాపుగా 8 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు 84 సాంస్కృతిక, ఈవెంట్స్ ఉంటాయని, తొలి రోజు 27 ఈవెంట్స్ నిర్వహించామన్నారు. 100 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఆసరా చారిటబుల్ సొసైటీ ప్రతినిధి శ్రీనాథ్, ఆహ్వాన సంఘం సభ్యురాలు కె సుశీల, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి వై.మోదాంబికా దేవి, ఎం.ఎల్లాజీ, ఎం.గుణశంకర్, వై.సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

నీటి సదుపాయం ఉన్న ప్రతి చోటా డ్రిప్ ఇరిగేషన్


ఉద్యాన ప్రగతిపై సమీక్షిస్తున్న రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు

మహారాణిపేట: నీటి సదుపాయం ఉన్న ప్రతి చోటా డ్రిప్ ఇరిగేషన్ పనులు చేపట్టాలని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఉత్తరాంధ్రలో 2024–25 సంవత్సరపు ఉద్యాన ప్రగతిపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆకాంక్ష ప్రకారం 15 శాతం వృద్ధి సాధించాలన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్, కూరగాయలు, జామ లాంటి లాభసాటి పంటలు విస్తీర్ణాన్ని, దిగుబడిని పెంచాలని ఆదేశించారు. ఉద్యాన అదనపు సంచాలకుడు కె.బాలాజీ నాయక్, సీబీ హరినాథ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారులు సత్యనారాయణరెడ్డి(విశాఖ), పీవీఎస్ జమదగ్ని(శ్రీకాకుళం), ఆర్.వి.ఎస్.ప్రసాద్(శ్రీకాకుళం), జి.ప్రభాకరరావు(అనకాపల్లి), ఎ.రమేష్‌బాబు(అల్లూరి), ఎ.ఎస్.వర ప్రసాద్ (పార్వతీపురం మన్యం జిల్లా), ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.